# బాలమిత్ర

- వాసంతి మాఘుపు.

## ఆటలంటే మాకిష్టం

ఆటలంటే మాకిష్టం - పాటలంటే మాకిష్టం
ఆటలకన్నా పాటలకన్నా - అల్లరి పనులే మాకిష్టం
సినిమాలంటే మాకిష్టం - మిఠాయిలంటే మాకిష్టం
సినిమాకన్నా మిఠాయికన్నా - షికార్లు కొట్టుట మాకిష్టం
పిట్టలంటే మాకిష్టం - పువ్వులంటే మాకిష్టం
పిట్టలకన్నా, పువ్వులకన్నా - చెట్లు ఎక్కడం మాకిష్టం
కొత్త బట్టలు మాకిష్టం - పౌడరు స్నోలు మాకిష్టం
బట్టలకన్నా పౌడరు కన్నా - మట్టిలో ఆటలు మాకిష్టం
టీచర్లంటే మాకిష్టం - పాఠాలంటే మాకిష్టం
టీచరు కన్నా పాఠం కన్నా - బడి సెలవంటే మాకిష్టం
వెన్నెలంటే మాకిష్టం - వానలంటే మాకిష్టం
వెన్నెలకన్నా వానలకన్నా - అమ్మ ముద్దులే మాకిష్టం.

## తెలుసుకుందాం!

**క. తనయుడు చెడుగై యుండిన**
**జనకుని తప్పన్నమాట సత్యమెటుగుగా**
**వున నీ జననీ జనకుల**
**కు నపఖ్యాతి యగురీతి గొనకు కుమారా!**

తనయుడు = కుమారుడు.
జనకుడు = తండ్రి.
జననీ జనకులు = తల్లిదండ్రులు.
అపఖ్యాతి = చెడ్డపేరు.

*కుమారుడు దుర్మార్గుడైన తండ్రిదే తప్పు అని అందురు. కాబట్టి నీ తల్లిదండ్రులకు అపకీర్తి వచ్చునట్టి మార్గమును పూనవలదు.*

## పదమేంటో చెప్పుకోండి!

క్రింద ఇచ్చిన ఆధారములనుపయోగించి పదమేంటో చెప్పుకోండి!

1. ఇది 6 అక్షరములు కలిగిన ఒక ఊరి పేరు. జిల్లా పేరు కూడా.
2. 5, 6 అక్షరములు కలిస్తే హిందీలో వేడి అని అర్థం.
3. 4, 5 అక్షరములు కలిస్తే అలంకార వస్తువు.
4. 5,3 అక్షరములు కలిస్తే బుద్ధుడు నిర్యాణము పొందిన ఊరు.
5. 1,2,3 అక్షరములు కలిపితే అర్జునుని ఇలా కూడా పిలవవచ్చు. దీర్ఘము మాయం.

ఏమిటా పదం?

## సమాధానం చెప్పగలరా? ప్రయత్నించండి!

1. అన్నతమ్ములిద్దరు మూడు అరటి పళ్ళను ముక్కలుగా చెయ్యకుండ సమానంగా తిన్నారు. ఎలా?
2. ఒక కిలో ఇనుము బరువా? కిలో దూది బరువా?
3. అడుగులు ఉన్నా, కాళ్ళు లేనిది ఏది?
4. నాలుగేళ్ళ అబ్బాయికి మూడేళ్ళ అమ్మాయికి పెళ్ళి జరిగింది. ఒక సంవత్సరము తిరగకుండానే వారికి పండంటి బాబు పుట్టాడు. దీనిలోని కిటుకేమిటి?

# పేరాశకు పోయిన నక్క కథ

ఒక అడవిలో ఒక నక్క ఉండేది. ఒకసారి అది ఆహారముకొఱకై వెదుకుచుండగా దానికి ఒక వేటగాడు ఎదురయ్యాడు. చెట్టు చాటునుండి నక్క ఆ వేటగాడిని గమనించసాగింది. ఆ వేటగాడు ఒక లేడిని చంపి భుజాన వేసుకొని వస్తున్నాడు. అంతలో అతనికొక అడవి పంది కనిపించింది. వెంటనే ఆ వేటగాడు గురి చూసి ఆ పందిపై బాణం వదిలాడు. బాణం కొద్దిగా గురితప్పి, పందికి గాయమయింది. అది కోపంతో వేటగాడిపై దాడిచేసి అతనిని చంపి కొద్దిసేపటికి అది కూడా ప్రాణాలు విడిచింది. వేటగానికి, పందికి జరిగిన పోరాటములో వారి కాళ్ళక్రింద పడి ఒక పాము నలిగిపోయి చచ్చిపోయింది. ఇది గమనించిన నక్క ఆనందానికి అవధులు లేవు. ఆ చచ్చిపడి ఉన్న లేడి, పంది, పాము, వేటగానిని చూచి "ఇక కొన్ని మాసముల వరకు మాంసము గురించి ఆలోచించనవసరము లేదు. పాము మాంసమును రేపు తినెదను. లేడి, పంది, వేటగాని మాంసములను తరువాత తినవచ్చు. నేడు ఈ వింటికి కట్టియున్న నరముతో సరిపెట్టుకుందును" అనుకుని ఆ నరమును కొరికింది. నరం తెగడముతో గట్టిగా వంచి బిగించిన బాణం బద్ద నిటారుగా సాగి అది నక్క గుండెలపై తగులుటవలన అది విలవిలలాడుతూ ప్రాణములు విడిచింది.

**నీతి** : లోభము (పేరాశ, పిసినారితనము) అరి షడ్వర్గములలో నొకటి. కావున పిసినారితనము పనికిరాదు.

## ఏడు వారాల నగలు

పూర్వము రోజులలో ఆదివారము మొదలు శనివారము వరకు రోజుకొక విధమైన ఆభరణము ధరించేవారు. వీటినే ఏడు వారముల నగలు అంటారు. గ్రహాల అనుగ్రహము కొఱకు, ఆరోగ్యరీత్యా స్త్రీ పురుషులు ఈ నగలను ధరించెడివారు. కంఠహారములు, గాజులు, కమ్మలు, ముక్కుపుడకలు, పాపిటబిల్ల, దండకడియము, ఉంగరములు మొదలైనవి కొన్ని ఆభరణములు.

**ఆదివారము** : సూర్యుని కోసము కెంపుల కమ్మలు, హారములు మొదలగునవి.
**సోమవారము** : చంద్రుని కోసము ముత్యాలహారములు, గాజులు మొదలైనవి.
**మంగళవారము** : కుజునికోసము పగడాల దండలు, ఉంగరాలు మొదలగునవి.
**బుధవారము** : బుధునికోసము పచ్చల పతకాలు, గాజులు మొదలగునవి.
**గురువారము** : బృహస్పతి కోసము పుష్యరాగము, కమ్మలు, ఉంగరాలు మొదలగునవి.
**శుక్రవారము** : శుక్రునికోసము వజ్రాల హారములు, ముక్కుపుడక మొదలగునవి.
**శనివారము** : శనీశ్వరునికోసము నీలమణి మణిహారములు మొదలైనవి.

(పాటీల్ నారాయణరెడ్డిగారి ఆచారాలు శాస్త్రీయత అను గ్రంథమునుండి)